ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సోనాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని బోథ్ ప్రిన్సిపల్ సంగీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మాత్రమే ఈ ప్రవేశానికి అర్హులు అని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మే 15 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ సభ సక్సెస్‌కు.. కసరత్తు!



వరంగల్ సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం

- జిల్లాలో చెల్లా చెదురైన బీఆర్‌ఎస్ నేతలు, అండగా నిలుస్తున్న కార్యకర్తలు
- తిరిగి పట్టు నిలుపుకునే ప్రయత్నం చేస్తున్న గులాబీ పార్టీ
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న మాజీ మంత్రి, బోథ్ ఎమ్మెల్యే
- నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ
- జిల్లా నుంచి భారీగా తరలనున్న పార్టీ శ్రేణులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఆవిర్భావించిన టీఆర్‌ఎస్ పార్టీ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) జిల్లాలో పట్టు నిలుపుకునే ప్రయత్నాలు చేస్తోంది. గడిచిన 25 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడింది. అనుకున్నట్లుగానే 14 ఏళ్ల పోరాటాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుని పాలనలో తనదైన ముద్రను వేసుకుంది. బీఆర్‌ఎస్ నేటితో 25 వసంతాలను పూర్తి చేసుకుంటుంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ మహాసభను ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ సిద్ధమయ్యింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఉద్యమకాలం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్‌కు అడుగడుగునా జిల్లా ప్రజలు అండగా నిలుస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోయినా ఉమ్మడి జిల్లాలో బోథ్, ఆసిఫాబాద్ రెండు అసెంబ్లీ స్థానాలను తన ఖాతాల్లో వేసుకుంది. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా రెండు సార్లు అధికారాన్ని చేపట్టిన బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోవడం పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేసింది. అధికారంలో లేక పోవడంతో అగ్రనేతలంతా పార్టీకి దూరమైనా కార్యకర్తలు మాత్రం అండగా నిలుస్తూ వస్తున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చావో రేవో తేల్చుకునేందుకు గులాబీ పార్టీ సమయాత్తమవుతోంది. జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా ఎదిగేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. గులాబీ బాస్ ఆదేశాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్‌లు ఎల్కతుర్తి మహాసభను విజయవంతం చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

తొలి ప్రయత్నంలోనే విజయం

తెలంగాణ సెంటిమెంట్‌తో జిల్లాలో అంచలంచెలుగా ఎదిగిన బీఆర్‌ఎస్ తొలిసారి 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి జిల్లాలో సత్తా చాటింది. ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గంలో గోవింద్‌నాయక్, ముథోల్‌లో నారాయణ్‌రావ్ పటేల్, బోథ్‌లో సోయంబాపురావ్ బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. అలాగే ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ మధుసూదన్‌రెడ్డి ఘన విజయం సాధించారు. మూడు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ నియోజక వర్గంలో విజయం సాధించడం బీఆర్‌ఎస్ తొలి విజయంగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాత రాష్ట్ర సాధన కోసం గులాబీ బాస్ కేసీఆర్ కఠినమైన నిర్ణయం తీసుకుని గెలుపొందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీని రాజీనామా చేయాలని ఆదేశించారు. కాని దీనికి అంగీకరించని అప్పటి బోథ్ ఎమ్మెల్యే సోయం బాపురావ్, ముథోల్ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఎంపీ మధుసూదన్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్ పార్టీ ఆదేశాల మేరకు పదవులకు రాజీనామా చేసి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన ఓటమి పాలయ్యారు. దీంతో పార్టీ కొంత డీలాపడినట్లు కనిపించినా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మళ్లీ పుంజుకోవడంతో అధికారాన్ని దక్కించుకుంది.

గీత దాటని కార్యకర్తలు

దశాబ్ద కాలం పాటు తిరుగులేని కారు పార్టీ అధికారం దూరం కాగానే అగ్రనేతలంతా చెల్లా చెదురై పోయారు. ప్రస్తుతం ఉద్యమ నేతలు పార్టీలో ఎవరూ కనిపించడం లేదు. జిల్లాలో పార్టీకి పునాదులు వేసిన లోక భూమారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చుంచు ఊశన్నలు పూర్తిగా కనుమరుగై పోయారు. అలాగే పార్టీ అధికారంలో ఉండగా పదవులను చేపట్టిన వారంతా ప్రస్తుతం పార్టీలో కనిపించడం లేదు. ముఖ్యంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్, బోథ్ మాజీ ఎమ్మెల్యేలు రేఖాశ్యాం నాయక్, రాథోడ్ బాపురావ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వల్లకొండ శోభారాణి - సత్యనారాయణగౌడ్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పలువురు ముఖ్య నేతలంతా పార్టీకి దూరమయ్యారు. కానీ బోథ్, ఆసిఫాబాద్ జిల్లాలో పార్టీ సత్తా చాటుతూ వస్తోంది. కార్యకర్తల్లో మాత్రం పార్టీపై తరగని అభిమానం కనిపిస్తోంది. బోథ్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గెలువడంతో పార్టీని విడిచి కార్యకర్తలు ఎవరు ఇతర పార్టీలల్లో చేరడం లేదు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో పార్టీ కొంత పలుచబడినట్లు కనిపిస్తున్నా ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లో మాత్రం బలంగానే కనిపిస్తోంది.

కారులో నయా జోష్

గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత పూర్తిగా సైలెంట్టైపోయిన కారు పార్టీలో వరంగల్ రజతోత్సవ మహాసభతో నయా జోష్ కనిపిస్తోంది. నియోజక వర్గానికి 3 వేల మందిని తరలించాలని పార్టీ ఆదేశించింది. కానీ ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల నుంచి దాదాపుగా 20వేల మంది తరలివెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ కార్యకర్తలను బహిరంగ సభకు తరలించేందుకు బీఆర్‌ఎస్ నేతలు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి వందలాది వాహనాల్లో కార్యకర్తలు తరలి వెళ్లనున్నారు. రెండేళ్ల తర్వాత కేసీఆర్ చేసే దిశా నిర్దేశం కోసం పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వరంగల్ సభతో బీఆర్‌ఎస్‌లో ఉత్సాహం కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా ఆ పార్టీ ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మండిపోతున్న ఎండల తీవ్రతకు జన సమీకరణపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టుబడుతున్న నేతలు

వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మహాసభను విజయవంతం చేసేందుకు జిల్లా బీఆర్‌ఎస్ నేతలు సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటించిన నేతలు జన సమీకరణ కోసం తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. ఎండలను సైతం లెక్క చేయకుండా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాల్లో ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. మళ్లీ జిల్లాలో పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎల్కతుర్తి సభను విజయవంతం చేసి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ప్లాన్ చేస్తున్నారు. అంచనాలకు మించిన జన సమీకరణకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ జన సమీకరణకు కసరత్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్‌కు కొంత అనుకూలమైన వాతావరణమే కనిపించడంతో ఎల్కతుర్తి మహాసభ సక్సెస్ కావడం ఖాయంగానే కనిపిస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

భూ భారతి చట్టంతో రైతులకు మేలు : కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూ భారతిని అమలు చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం రెవెన్యూ గార్డెన్‌లో భూభారతి ఆర్వోఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను శాలువాతో సత్కరించి పూలబుకేలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆర్డీఓ వినోద్ కుమార్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ వాజిద్‌అలీ, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే జిల్లాకు అవార్డు..

ఇటీవల సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషాను డీపీఆర్ఓ తిరుతమల ఆధ్వర్యంలో పాత్రికేయులు సన్మానించారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో నార్నూర్ బ్లాక్ అస్పరేషనల్ ప్రోగ్రామం 2024కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా అధికారులు, మీడియా, ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే జిల్లాకు అవార్డు వచ్చిందన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఆరోగ్య పాఠశాల, కళాశాల, విద్య, వైద్య, రైతుల సంక్షేమం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రజలకు దగ్గరగా ఉంటునే వారి సమస్యలు తెలుసుకుంటు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. జాతీయస్థాయిలో జిల్లాకు అవార్డు రావడం గర్వకారణంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమస్యను విన్నవిస్తున్న వాఘపూర్ రైతులు

నేరడిగొండ : ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించనుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని సూర్య గార్డెన్‌లో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి. భీమ్ రెడ్డి, తహసీల్దార్ కలీం. డీటీ మహేష, ఎంఆర్ఐ నాగోరావ్, ఎంపీడీఓ రాజ్ వీర్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మావల : భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రైతులు ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై తహసీల్దార్ గ్రామస్తులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అంతకు ముందు పలువురు రైతులు భూ భారతి చట్టం పై సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. సదస్సులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో శోభన, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు. ప్రగతిశీల బ్లాక్ ప్రోగ్రాం కేటాగిరిలో జిల్లా కలెక్టర్ రాజార్షిషాకు దేశ ప్రధాని నరేంద్ర మోది ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ అవార్డును అందజేసినందుకు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నేడు ఆకాశవాణిలో జిల్లా కలెక్టర్ సందేశం..

ఆదిలాబాద్ రూరల్ : ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందుకొని వచ్చిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో రికార్డు చేసిన సందేశాన్ని ఆదివారం ఉదయం 8 గంటల 45 నిమిషాలకు ప్రసారం చేస్తున్నట్లు ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ముఖ్య కార్యక్రమాధికారి కె.రామేశ్వర్ తెలిపారు. నీతి అయోగ్ వారి ఆస్పిరేషనల్ మండల కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జాతీయ స్థాయిలో సాధించిన ఘనతను, ఆ ఘనతను సాధించడానికి చేసిన కృషిని జిల్లా కలెక్టర్ ఈ ముచ్చట కార్యక్రమంలో వివరిం చారని ఆయన తెలిపారు. తొలిసారిగా ఆకాశవాణి కేంద్రానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాజార్షిషాను ఆకాశవాణి సిబ్బంది సత్కరించారు.

5న జిల్లాకు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి రాక

ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరి జిల్లాకు రానున్నారు. మే 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు రహదారులకు భూమిపూజ చేయనున్నారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా కార్యకర్తలతో నిర్వహించే బహిరంగసభకు హాజరవుతారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లనున్నారు. ఇప్పటికే నేషనల్‌హైవే అథారిటీ అధికారులు, పార్లమెంట్ సభ్యులు ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్‌తో ప్రత్యేకంగా సమావేశమై కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి రాకతో జిల్లా రహదారులకు నిధులు మంజూరు కావడంతో పాటు రహదారుల విస్తరణ, కొత్తగా మరిన్ని రోడ్లనిర్మాణ పనులను చేపట్టే అవకాశం ఉందంటున్నారు. నితిన్‌గడ్కరి జిల్లాకు రానున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి కార్యకర్తలను తరలించేందుకు బీజేపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

మళ్లీ తప్పులు చేస్తే చర్యలే

- డీఆర్‌డీ ఏపీడీ కుటుంబరావు



ఉపాధి సిబ్బందిని ప్రశ్నలు అడుగుతున్న అధికారులు

తాంసి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరానికి ఒకసారి నిర్వహించే ఉపాధి పథకం సామాజిక సమావేశం శనివారం తాంసి మండల కేంద్రంలో నిర్వహించారు. గంటన్నరలోనే ఈ సమావేశం ముగిసింది. తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమానికి డీఆర్డీఏ అడిషనల్ పీడీ కుటుం బరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరం గనుక ఇలాంటి తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యత ఉండాలని ప్రతిపనికి సంబంధించిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు తమ నివేదికలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేపట్టాలని అన్నారు. కూలీలకు దూరభారాన్ని తగ్గించి దగ్గరలో పని సూచించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణారావు, ఎంపీ డీవో మోహన్‌రెడ్డి, ఏపీవో విజయ, ఉపాధి సిబ్బంది సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను వినియోగించుకోవాలి : పీవో



ఆర్వో ప్లాంట్ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న ఉమాపతి కుంట గ్రామస్థుల కోసం ఐటీడీఏ ద్వారా శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గిరిజనులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శనివారం మండలంలోని ఉమాపతి కుంట గ్రామాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన శుద్ధజల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు తాగడం వల్ల అంటువ్యాధుల నుంచి తమను తాము కాపాడుకోవచ్చని సూచించారు. భూగర్భజలాలు ఇంకిపోతున్నందున మంచినీటి సమస్యలు ఏర్పడితే వాగుల్లో చెలిమల ద్వారా లభించే నీటిని తాగి అనారోగ్యాలు తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌వో గుడిమల్ల సందీప్‌కుమార్, మాజీసర్పంచ్ జుగాదిరావు, కార్యదర్శి పండిత్ తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి’

నార్నూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అధికార ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక రాష్ట్ర సభ్యుడు జాడే నాందేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట చేసే కార్మికులకు కూడా ఇంత అవస్థలు పెడితే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వమే వంట గ్యాస్‌ను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఝాడే తాయి, శివబాయి, సక్రవంతి, శివబాయి, సులోచనబాయి, జైతుబాయి, గిర్జా బాయి, రాంబాయి, జన్నబాయి, భూంబాయి పాల్గొన్నారు.

‘మా భూమి రథయాత్రను విజయవంతం చేయండి’

తలమడుగు , ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపన కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రను తలమడుగు మండలంలో విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తలమడుగు మండల నాయకులు అగ్గిమల్ల నవీన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తలమడుగు మండల కేంద్రంలో జరిగే లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అగ్గిమల్ల గంగన్న, మధుకర్, స్వామి, నవీన్, అరుణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

‘నిరుద్యోగ యువతను ప్రభుత్వం ఆదుకోవాలి’

నార్నూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కోసం నిర్వహించే కొన్ని పోటీపరీక్షలకు యువతకు వయసు సడలింపు ఇవ్వాలని శనివారం మండల కేంద్రంలో నిరుద్యోగ యువత డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్‌లు కేవలం 25 సంవత్సరాల లోపు భర్తీ చేస్తున్నారన్నారు. దీన్ని వలన చాలా వరకు నష్టపోతున్నామన్నారు. కనీసం 30 సంవత్సరాల వరకు వయసు సడలింపు ఇస్తూ ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను కాపాడాలని పేర్కొన్నారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- తొమ్మిదేళ్ల చిన్నారికి క్యాన్సర్ సర్జరీ సక్సెస్



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తున్నామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శనివారం సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సూపరిండెంట్ డాక్టర్ సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ దేవిదాస్ తొమ్మిదేండ్ల పాప క్యాన్సర్‌తో బాధపడుతూ రిమ్స్ చేరిందన్నారు. ఆమెను పరీక్షించిన దేవిదాస్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. రిమ్స్ నుంచి ఏ ఒక్క కేసు కూడా రిఫర్ కాకుండా ఇక్కడే అన్ని రకాల వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. కొన్ని విభాగాల్లో వైద్యులు ఖాళీగా ఉన్నారని, వాటిని కూడా త్వరలో భర్తీచేసేల కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రిమ్స్ అందించే ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహల నిర్మూలనను అందరు బాధ్యతగా తీసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి అన్నారు. శనివారం విద్యానగర్‌లోని బాలరక్షణ్ భవన్‌లో షూర్ సొసైటీ ఆధ్వర్యంలో బాల్య వివాహలపై పురోహితులు, మౌలన, ఖాజీ, చర్చి పాస్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా బాల్య వివాహల వల్ల జరిగే నష్టాలను తెలియజేస్తు చట్టాల గురించి వివరించారు. అ బాల్యవివాహల నిర్మూలనపై ముద్రించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి మాట్లాడుతూ... బాల్య వివాహలు చేయడంతో పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ రాజేంద్రప్రసాద్, చైల్డ్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్, కమిటీ సభ్యులు దశరథ్, డెవిడ్, షుర్ ఎన్జీఓ జిల్లా కో-ఆర్డినేటర్ వినోద్, సదర్ ఖాజీ అబ్దుల్ నదీం పాల్గొన్నారు.

పీపీకి పలువురి సన్మానం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన ఏపీ రహీమ్‌ను ప్రముఖ దుర్గం ట్రస్టు నిర్వాహకులు, చైర్మన్ దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం దుర్గం ట్రస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీపీ రహీంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అంబేద్కర్ ఫొటోను బహూకరించారు. అడిషనల్ పీపీ మేకల మధుకర్, న్యాయవాదులు సంతోష్, దుర్గం ట్రస్టు సభ్యులు మాదస్తు మహేందర్, కావేటి, మోహన్, ఆడేరఘునాథ్, అనుదీప్, దర్శశ్రీనివాస్, గణేష్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బోథ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటబీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకానికి అర్హులైన జాబితాలో ఉన్న లబ్ధిదారుల ఇళ్లను ఎంపీడీవో రమేష్ శనివారం పరిశీలించారు గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో డెమ్మి కౌటబి గ్రామాలలో ఇంటింటికి వెళ్లి పరిశీలించారు అర్హులైన వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు.

కలెక్టర్ కృషితో నార్నూర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు

నార్నూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో నార్నూర్ మండలానికి కలెక్టర్ రాజర్షిషా కృషి వల్ల గుర్తింపు వచ్చిందని టీ నిమ్స్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పే సొంబాయి అన్నారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం భు భారతి చట్టం అవగాహన సదస్సుకు నార్నూర్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా నేతకని మహర్ సంఘం పక్షాన శాలువా కప్పి సన్మానం చేశారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇక కేంద్రం.. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని కవులు, రచయితలు సూచించారు. కాశ్మీర్ పహల్గావ్ ఘటన నిరసిస్తూ బాధితులు, దేశానికి అండగా ఆదిలాబాద్ జిల్లా కవులు, రచయితలు, శనివారం రాత్రి తెలంగాణ కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రచయితలు సుమనస్పతిరెడ్డి, ఉదారి నారాయణ, సామల రాజవర్దన్, బి.మురళీధర్, రంగాచార్య, వీరన్న, లెనిన్, కమలాకర్ రెడ్డి, త్రివేణి యాదవ్, లక్ష్మీనారాయణ, బాబన్న, గంగన్న పాల్గొన్నారు.

భూ భారతి అవగాహన సదస్సును విజయవంతం చేయండి

తలమడుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ బదులుగా కొత్త భూ భారతి ఆర్‌వోర్ యాక్ట్ 2025 భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతు మేలు కోసం ప్రవేశ నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంపై సమస్త ప్రజలకు ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఉమడం గ్రామంలోని అయేషా ఫంక్షన్ హాల్‌లో రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో కలెక్టర్ ఆర్డీవో సమక్షంలో కొత్త ఆర్‌వోఆర్‌చట్టం గురించి వివరించారు. కార్యక్రమానికి గ్రామాల ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, రైతు కూలీలు, అందరూ అధిక సంఖ్యలో హాజరై కొత్త ఆర్‌వోఆర్ చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు. ముఖంగా ధరణిలో సమస్యలు పరిష్కారం కాని రైతులు ఇట్టి చట్టంను ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే భూ సమస్యలు ఏవైనా ఉంటే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

తాంసి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమం తాంసి మండల కేంద్రంలో సోమవారం ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక

తాంసి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏ కష్టం వచ్చిన తనను సంప్రదిస్తే ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఏ ఒక్కరు అధైర్య పడకండి అండగా ఉంటానంటూ భరోసా కల్పించారు. మండలంలోని జామిడి గ్రామానికి చెందిన 250 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు ప్రభుత్వం పేరిట అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెబుతూ కాలం వెల్లదీస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని ఏ ఒక్కరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రైతులకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామం నుంచి వందలాదిమంది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరనున్నారన్నారు. అనంతరం యువతి యువకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

కార్యక్రమంలో నాయకులు బద్దం వినోద్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అశోక్, రమణ, రఘు, కృష్ణ, తిరుమల గౌడ్, కేదారేశ్వర రెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి తెలంగాణ సాధించడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నవంబర్‌వన్‌గా నిలిపిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. శనివారం గాయత్రి గార్డెన్స్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ సభను కనివిని ఎరుగని రీతిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఆదివారం సభ జరగనున్న నేపథ్యంలో శ్రేణులను తరలించే ఏర్పాట్లు, వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తీసుకోవాల్సిన చర్యల పై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, యాసం నర్సింగరావు, మారిశెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, పండ్లశ్రీను,దమ్మపాల్, కొండగణేష్, బట్టసతీష్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాజీ మంత్రి జోగురామన్న

మావల : మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ నల్ల రాజేశ్వర్ మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం మాజీ జడ్పీటీసీ నల్ల వనితను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి పరామర్శించారు. ఈ నల్ల రాజేశ్వర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీకి విశేష సేవలందించామని గుర్తు చేశారు. వారి కుటుంబానికి పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో 45.5 గరిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. శనివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 44.6 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 30.2 డిగ్రీలుగా నమోదైంది. అలాగే అత్యధికంగా సిరికొండలో 45.5, నేరడిగొండలో 45.4, బేలలో 45.2, మావలలో 44.8, భీంపూర్‌లో 44.7 ఇలా జిల్లా వ్యాప్తంగా 41 డిగ్రీలకు పైగానే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే గత రాత్రి నుంచి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురవడంతో ఎండల తీవ్రత కొంత తగ్గుముఖం పడుతుంది. శనివారం ఉదయం నుంచి జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం కొంత చల్లబడింది. సాయంత్రం సమయంలో ఆకాశం మేఘావృతమై మబ్బులు పట్టడంతో ఎండ తీవ్రత తగ్గింది. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం కనిపించింది. మొత్తానికి ఎండల తీవ్రత నుంచి జిల్లా ప్రజలు కొంత ఉపశమనం పొందారు. వడగాలుల ప్రభావానికి మాత్రం జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించడంతో జొన్న పంటను ఆరబోసుకున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

సెల్ఫీ దిగుదాం - వరంగల్ వెళదాం

నేరడిగొండ , ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రజతోత్సవ సభకు అందరూ సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలో గల వారి నివాసంలో చలో వరంగల్ సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేసి శనివారం ఫోటో దిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఇంటి పార్టీ రజతోత్సవ సభకు అందరూ తరలిరావాలని అందరూ సెల్ఫీ పాయింట్‌లో సెల్ఫీ దిగుదాం, వరంగల్‌కు వెళదాం అని పిలుపునిచ్చారు. నేరడిగొండ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా ఛలో వరంగల్ సభ కొరకు నేరడిగొండ కుప్టి ఘాట్ వద్ద వాల్ పెయింటింగ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు.

చలో వరంగల్ సభను విజయవంతం చేయాలి

జైనథ్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): వరం గల్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మార్కెట్ చైర్మన్ ముక్కెర ప్రభాకర్ పిలుపునిచ్చారు. అందులో భాగంగానే శనివారం బోరజ్ మండలం మాండగడలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ హయాంలోనే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. బోరజ్ మండలం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

హమాలీల గుర్తింపు కోసం నిర్ధారణ పరీక్ష

బోథ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో కూలీలుగా పనిచేసేందుకు గాను అర్హులైన వారి ఎంపిక కోసం జిల్లా మార్కెట్ అధికారి ప్రేమ్ సింగ్, కార్మిక శాఖ అధికారి వినోద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విట్టల్, స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్రల సమక్షంలో కూలీల ఎంపిక ప్రక్రియ కొనసాగింది. హమాలీ కూలీలుగా పనిచేసేందుకు 82 మంది దరఖాస్తు చేసుకోగా అందులో నుండి 50 సంవత్సరాల పైబడిన వారిని తిరస్కరించారు. మిగిలిన హమారీలకు 15 మందికి ఒక గ్రూపుగా నిర్ధారించి లారీలలో 600 జొన్నల బస్తాలను గంటన్నర సమయంలో లోడింగ్ చేయించే ప్రక్రియ నిర్వహించారు. దీంతో హమాలీలుగా చేయాలనుకున్న వారు అధికారులు ఇచ్చిన సమయంలో లోడింగ్ ప్రక్రియ చేపట్టారు. వీడియో కెమెరాల ద్వారా లోడింగ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ తాము ఇచ్చిన సమయంలో 600 బస్తాలు గంటన్నర సమయంలో ఎవరైతే లారీలో భర్తీ చేస్తారో వారిని హమాలీలుగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ బి. గంగారెడ్డి సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, సొసైటీ డైరెక్టర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రాజు యాదవ్‌తో పాటు పలువురు ఉన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించడం జరిగింది.

ఉరి వేసుకుని మహారాష్ట్ర వాసి మృతి

నేరడిగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర రోజ్ కాలనీ నాగపూర్‌కు చెందిన మన్వర్ ఖాన్ (56) ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మున్వర్‌ఖాన్ గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండేవాడని, వారానికి ఒకసారి డయాలసిస్ చేయించుకునేవాడు. అతనికి ఐచర్ వాహనం ఉంది. ఆ వాహనానికి ఓనర్ కమ్ డ్రైవర్‌గా నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు, ఒక మగ పిల్లాడు ఉన్నాడు. కాగా బుధవారం నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు సరుకులతో వెళుతున్న క్రమంలో మండలంలోని కుప్టిఘాట్ ప్రాంతంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడగా గురువారం కొంత మంది కూలీలను మాట్లాడి వాహనాల్లో సరుకులు నింపుకున్నాడు. ఉదయం బహిర్భూమికి వెళుతున్నానని తన క్లినర్‌కు చెప్పి వెళ్లి పక్కనే గల గుట్టలో తన వాహనంలో ఉన్న నైలాన్ తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎంతకు రాకపోయేసరికి క్లీనర్ వెతకగా చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పంచనమానా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పాఠశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడలో అను మతులు లేని పాఠశాలపై ఎన్ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు ఫైర్ సేఫ్టీ, బిల్డింగ్ పర్మిషన్, మున్సిపల్ అనుమతి, ట్రాఫిక్ క్లియరెన్స్, సౌండ్ క్లియరెన్స్, ఇతర ఎన్ఓసీలు లేవని ఆరోపించారు. జిల్లా విద్యాధికారి ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

భూభారతితో వెంటనే సమస్యల పరిష్కారం

● మండల ప్రత్యేకాధికారి శంకర్



రైతువేదికలో భూభారతిపై మాట్లాడుతున్న అధికారి

కుబీర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూభారతి ప్రజల సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. శనివారం మండలంలోని సొనారి గ్రామ రైతువేదికలో భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు తహసీల్దార్ రాంచందర్, గిర్దావార్ నరేష్ భూభారతి చట్టంలో పొందుపరిచిన విషయాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసి చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏవో సారికరావు, ఏఈవో నారాయణ, చరణ్, పంచాయతీ కార్యదర్శి గంధం వినయ్, ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల రైతువేదికలో ..



కుంటాల రైతు వేదికలో మాట్లాడుతున్న భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్

కుంటాల, ఏప్రిల్, 26 : (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కొంకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాల స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసమే ధరణి పోర్టల్ ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎల్లప్పుడు రైతుల పక్షాన ఉంటుందని, రైతుల మేలు కొరకే ధరణి పోర్టల్‌ను తీసివేసి భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి పథకం ద్వారా రైతులకు కలిగే లాభాలను తహసీల్దార్ కమల్ సింగ్ వివరంగా వివరించారు. ఈ పథకంలో రాబోయే రోజుల్లో రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉండవని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ కమల్ సింగ్, డీటీ నరేష్ గౌడ్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

పనిగంటలు పెంచడాన్ని తిప్పికొట్టండి : టీయూసీఐ

లక్ష్మణచాంద, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పనిగంటల పెంచడానికి సంబంధించిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ను తిప్పికొట్టాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) శనివారం పిలుపునిచ్చింది. అంతకు ముందు 139వ మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న మాట్లాడుతూ... దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమ జీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు లింగన్న, కిషన్, సాయన్న, గంగన్న, సరోజ, రవి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ

ఖానాపూర్‌లో బంద్ విజయవంతం



ఖానాపూర్‌లోని ప్రధాన కూడళ్లలో మూసి ఉన్న దుకాణసముదాయాలు

ఖానాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ హిందూ ఉత్సవ సమితి, హిందూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వ్యాపారులు స్వచ్ఛందంగా వ్యాపార సముదాయాలను మూసి వేసి హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపునకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్ మాట్లాడుతూ... పహల్గాం ఘటనకు భారత్ కచ్చితంగా ధీటైన సమాధానం చెబుతుందన్నారు. ఉగ్రవాదం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ దేశానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

కడెంలో ప్రశాంతంగా కొనసాగిన బంద్

కడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. కాశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా శనివారం బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు వ్యాపారులు, ప్రజలు సహకరిస్తూ తమ వ్యాపార సముదాయాలను మూసి వేశారు. ఉగ్ర దాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు.

ముస్లిం ఏక్తా సంఘం కొవ్వొత్తుల ర్యాలీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ నిర్మల్ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదులను అంతం చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు ముజాహిద్, ఉపాధ్యక్షుడు సాజిద్, ఫాజిల్, హష్మీ, అఫ్రోజ్ పాషా, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో నిరసన

బాసర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా బాసర సరస్వతీ దేవస్థాన ఉద్యోగులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఆలయం వద్ద అర్చకులు అధికారులు సిబ్బంది ఇలా అందరూ నిరసనల్లో పాల్గొన్నారు.రాజగోపురం నుండి వ్యాస ఆలయం వరకు ఉగ్ర చర్యకు , పాకిస్తాన్‌కు వ్యతిరేక నినాదాలతో ప్లకార్డుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు.ఉగ్రదాడిలో ప్రాణాలు వదిలిన వారి ఆత్మ శాంతించాలని కొవ్వొత్తుల వెలిగించి సంతాపం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం

● భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మ ● బీజేపీ ఆధ్వర్యంలో భైంసా ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన



ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన

భైంసా రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీలు వేసి ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అప్పాల రాకేష్, సచిన్, నాయకులు యోగేష్ అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, జరుగుతున్న అవకతవకలపై బీజేపీ మండల అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి ఆధ్వర్యంలో భైంసా ఎంపీడీవో కార్యాలయం ముందు వారు నిరసన చేపట్టి మాట్లాడారు. గ్రామ సభలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎవరికి తెలియకుండా అర్హుల జాబితా తయారు చేయడం ఏంటని మండిపడ్డారు. తక్షణమే గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అర్హుల జాబితా లిస్టును ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ వారికి ఇవ్వడం అంటే రాజ్యాంగ విరుద్ధమని, అవి ప్రభుత్వ కమిటీల లేదా కాంగ్రెస్ కమిటీల అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తుందన్నారు. పేదలకు అన్యాయం జరిగితే ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నేతృత్వంలో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, పెండ్‌పెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు సాయినాథ్, కరుమ కృష్ణ, చంద్రకాంత్, బీజేపీ కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పులు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు అర్లీ(కే), తురాటి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పులు దొర్లాయని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి తన పేరు లబ్ధిదారుల జాబితాలో రాలేదని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు విచారణ చేపట్టి నివేదిక కలెక్టర్‌కు పంపారు. ఈ సందర్భంగా అర్లీ(కే) గ్రామానికి చెందిన మగ్గిడి ప్రభాకర్ మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాలకు అర్హుల జాబితాలో పేర్లు, వివరాలు వంటివి రాసేటప్పుడు అర్లీ(కే) గ్రామానికి వచ్చిన సిబ్బంది ముత్యం, సురేష్ తప్పుడు సమాచారం రాయడంతో ఇళ్లు రాలేదన్నారు. అధికారులు బలహీన వర్గాలకు ఇళ్లు అందేలా విచారణ చేపట్టి లబ్ధి చేకూర్చాలని వేడుకున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



గుండంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. శనివారం గుండంపల్లిలో జొన్న, ధాన్యం, దిలావర్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండంపల్లిలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే డబ్బులకు భద్రత, భరోసా ఉంటుందని, అదే మధ్య దళారులకు విక్రయిస్తే డబ్బులు మోసపోయే ప్రమాదముందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ధాన్యాన్ని ఏ గ్రేడ్‌కు రూ. 2,320లు, బి గ్రేడ్‌కు రూ. 2,300లు మద్దతు ధర లభిస్తుందన్నారు. జొన్నలకు క్వింటాల్‌కు రూ. 3,371ల మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు అక్కడిక్కడా అమ్ముకుని మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఉప తహసీల్దార్ రమేష్, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కే. దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ టి. రమణారెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ టి. విద్యాసాగర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సాయన్న, పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కట్కం రాజారెడ్డి, అనిల్, కృష్ణ, రమణ, కోడె నవీన్, సప్పల రవి, తదితరులు పాల్గొన్నారు.

కడెం మండలం ఎలగడప గ్రామంలో..

కడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూమన్న అన్నారు. కడెం మండలంలోని ఎలగడప గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ శైలజ రమేష్ రావు జిల్లా నాయకులు సతీష్ రెడ్డి, సలీం, రమేష్, భూమరాజం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కుంటాల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్టు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 నుండి 12 గంటల వరకు 7 నుండి 10 తరగతులకు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. మొత్తం 590 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు.

139వ మే డే స్ఫూర్తితో

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దుకు పోరాడుదాం

ముథోల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : 139వ మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై పోరాడుదామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. హరిత కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన ముథోల్‌లో 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు రాజేశ్వర్, సురేష్, భోజరాం, రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతకు పాతర

● ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం ● పనుల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అధికారుల అలసత్వంతో ప్రజాధనం వృథా అవుతోంది. రూ. పది కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలకు పాతరేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

రూ. 10 కోట్లు.. 5 కిలో మీటర్లు

61వ జాతీయ రహదారి నుంచి గుండంపల్లి వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు అనేక మూల మలుపులతో ప్రమాదకరంగా ఉండే ది. గుండంపల్లి, సముందర్‌పల్లి, రత్నాపూర్ కాండ్లీ, టెంబుర్ని గ్రామా లకు ఇదే ప్రధానమైన రోడ్డు. రోడ్డు ఇరుకుగా మూల మలుపులతో ఉండటంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. అయితే రోడ్డును విస్తరించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధు లు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చొరవ తీసుకుని రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయించారు. 5 కిలో మీటర్ల మేర విస్తరణ పనులకు రూ. 10 కోట్లు మంజూరు చేసింది.

నాణ్యతకు తిలోదకాలు

రూ. 10 కోట్ల ప్రజాధనంతో నిర్మిస్తున్న విస్తరణ పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు తారు రోడ్డు వేసుకుంటూ పోతుంటే మరోవైపు తారు లేచి కంక ర తేలడం ఆరోపణలకు బలం చేకూరుతోంది. చర్లపల్లి మూల మలుపు వద్ద రోడ్డు వేసిన రెండు రోజులకే కంకర తేలడం, ప్యాచ్ వేసే పరిస్థితి రావడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కోట్లు వెచ్చించి ని ర్మిస్తున్న రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటవుతుందేమోనన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.



చర్లపల్లి మూల మలుపు వద్ద తారు లేచిపోయి కంకర తేలిన రోడ్డు

ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం

రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు తమ కేమి పట్టనట్లు ప్రవర్తిస్తున్నారు. పనులు జరుగుతున్న ప్పుడు సూచనలు చేయాల్సిన సంబంధిత ఇంజనీర్ సైడ్ మీదికి రాకుం డా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రోడ్డు విస్తర ణకు సంబంధించి కొలతలు సైతం పని చేసే కూలీలే తీసుకుని రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోడ్డు విస్త రణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు దెబ్బ తినేందుకు ఆస్కారం ఉంది.



టెంబుర్ని చెరువు సమీపంలో రోడ్డుపై గుంత పడిన దృశ్యం

నాణ్యత పాటించకపోతే రోడ్డు వేసినా ఫలితం శూన్యం

రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత పాటించకపోతే అన్ని కోట్లు ఖర్చు పెట్టి రోడ్డు వేసినా ఫలితం శూన్యమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ అధికారులైనా ఈ రోడ్డు నిర్మాణం పై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనం పక్కదారి పట్టకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాసర ఆర్జీయూకేటీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన

బాసర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన కొనసాగుతోంది. విధులను బహిష్కరించి నిరసనల కార్యక్రమాలు చేపడుతున్నారు. 18వ రోజు శనివారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహిషాసుర మర్దిని అవతారం ఎత్తి వినూత్న రీతిలో నిరసన చేపట్టగా , మెంటర్స్ సీఎం మాస్క్ తో ఉన్న వ్యక్తి తమ స మస్యలతో కూడిన విన తి పత్రం అందించి ఆం దోళన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించుకునే అవకాశం లేనందున ఇలా అయినా సీఎం వరకు మా గోడు వెలుతుందనే ఉద్దేశంతో చేసినట్లు చెప్పారు. మాకు వేదికలు కావు జీవిత భద్రత కావాలి మాకు వాగ్దానాలు కావు నియామక ఉత్తర్వులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి,రాములు, ఎన్ విజయ్ కుమార్, ప్రభాకర్, ఉపేందర్ , కృష్ణ ప్రసాద్ ,తిరుపతి, చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిషాసురా మర్దిని అవతారం ఎత్తి నిరసన తెలుపుతున్న దృశ్యం



సీఎం రేవంత్ రెడ్డి మాస్క్ ధరించిన వ్యక్తికి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

సంప్రదాయ నృత్య కళలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలి



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మన సంప్రదాయ నృత్య కళలను విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిలో శిక్షణ ఇవ్వాలని మండల విద్యాధికారి పరమేశ్వర్ అన్నారు. పట్టణంలోని విజయ హైస్కూల్‌లో నట రాజ నృత్య కళానికేతన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు రజిత, అడ్వకేట్ అంజు కుమార్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, డాక్టర్ కృష్ణంరాజు, మంచిర్యాల నాగభూషణం, ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




పిల్లలను ఉయ్యాలలో ఊపుతున్న దృశ్యం

బతుకు పోరాటం.. మాతృత్వపు మమకారం

ఈ లోకంలో అమ్మ ప్రేమను మించింది ఏది లేదు. మాతృత్వపు మమకారానికి ఏదీ సాటిరాదు అనడానికి ఇక్కడ కనిపించే దృశ్యమే నిలువెత్తు నిదర్శనం.ఒక వైపు జీవనోపాధి కోసం కిరాణాషాపు నడుపుతునే మరో వైపు మండుటెండకు అలసిపోయిన తన పిల్లలను ఉయ్యాలలో లాలిస్తూ జోల పాడుతూ నిద్ర పుచ్చుతున్న ఈ సుందర దృశ్యం సిరికొండ మండలం వాయిపేట్ గ్రామ పంచాయతీ పరిధి లోని చిమ్మన్‌గూడలో ఆవిష్కృతమైంది. ఓ మహిళ పొట్టకూటి కోసం కిరాణాషాప్ నడుపుతు తన ఇద్దరు పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవడం పలువురిని కదిలించింది. తల్లి ప్రేమను గుర్తు చేసింది.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



జీవనోపాధి కోసం కిరాణాషాపు నడుతున్న దృశ్యం

ఐఏఎస్ సాధించిన సాయిచైతన్య ఉట్నూర్‌కు గర్వ కారణం

● సన్మానాలతో ముంచెత్తుతున్న రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు



ఉట్నూర్‌లో సాయి చైతన్యను సన్మానిస్తున్న రితేష్ రాథోడ్





సన్మానిస్తున్న ఏపీవో జనరల్ వసంత్‌రావు, కలెక్టర్ రాజర్షిషా

ఉట్నూర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీలో 68వ ర్యాంకు సాధించిన ఉట్నూర్ ముద్దుబిడ్డ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ జాదవ్ గోవింద్‌రావు కుమారుడు సాయి చైతన్య జాదవ్ జోరుగా సన్మానాలు అందుకుంటున్నారు. ఐఏఎస్ సాధించి తొలిసారిగా ఉట్నూర్‌కు రావడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అకుంఠిత దీక్షతో ఐఏఎస్ సాధించిన సాయిచైతన్య ఉట్నూర్ పట్టణానికి గర్వ కారణం అంటూ రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ ఉద్యోగులు, అభిమానులు, బంజారాసేవ సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సాయిచైతన్యను సన్మానాలతో ముంచెత్తుతున్నారు. కుమారుడితో పాటు అమ్మనాన్నలు కవిత, గోవిందరావులను సన్మానిస్తున్నారు.ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సైతం ఐఏఎస్ సాధించిన బంజారా ముద్దుబిడ్డ సాయి చైతన్యను శాలువాతో సన్మానించి అభినందించారు. సాయి చైతన్య స్ఫూర్తితో ఉట్నూర్ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండేరి రమేష్, సీపతి లింగాగౌడ్, బింగి వెంకటేశ్, జాదవ్‌రవీందర్, పెంట కైలాస్, సంపంగిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్ తన అనుచరులతో కలిసి సాయిచైతన్యను ఘనంగా సన్మానించారు.

ఏపీవో జనరల్‌తో సన్మానం

సివిల్స్‌లో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన సాయి చైతన్యను ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు సన్మానించారు. అదేవిధంగా సాయిచైతన్య తల్లిదండ్రులను కూడా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌ను కలిసిన సాయి చైతన్య

ఆదిలాబాద్ రూరల్: యూపీఎస్సీ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన ఉట్నూర్‌కు చెందిన గిరిజనుడు సాయి చైతన్య జాదవ్ శనివారం కలెక్టర్ రాజర్షిషాను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జ్ఞాపిక అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. జిల్లా నుంచి ఐఏఎస్‌కు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో శబరిమాత ఆలయ వార్షికోత్సవం



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బోథ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శబరిమాత ఆలయ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది కార్యక్రమంలో జిల్లాలోని నలుమూలల నుంచి శబరిమాత ఆశ్రమాల నుంచి భక్తులు తరలివచ్చారు ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా పల్లకి ఊరేగింపు రామనామ స్మరణ చేస్తూ కొన సాగింది కార్యక్రమంలో శబరిమాత భక్తుడు అయిన ఎడమల ధర్మారెడ్డి చేతుల మీదుగా పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం ఆశ్రమం వద్ద భజన కార్య క్రమం కొనసాగింది వచ్చిన భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



శబరిమాత ఆశ్రమం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆకాశవాణిలో సుంకిడి పాఠశాల విద్యార్థుల కార్యక్రమం ప్రసారం

తలమడుగు , ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి ఆదిలాబాద్ ఎఫ్ ఎం కేంద్రం 100.2లో సుంకిడి ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే హిందీ భాషలో 30 నిమిషాల కార్యక్రం ప్రసారమవతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాస్ స్వామి, హిందీ స్కూల్ అసిస్టెంట్ సుకుమార్ పెట్కులే, ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్ర డైరెక్టర్ కె.రామేశ్వర్‌లు తెలిపారు. కాగా ఈ కార్యక్రమం మొత్తం హిందీ భాషలోనే ఉంటుందని ఆదివారం సాయంత్రం 5.30 నిమిషాల నుంచి 6 గంటలకు ప్రసారమవుతుందని, కార్యక్రమాన్ని అందరూ తప్పక విని మన ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ పిల్లల్ని ప్రోత్సహించాలని శ్రోతలను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, బి.గజానంద్, వై.రామ్‌రెడ్డి, ఆర్.సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, పీడీ నాందేవ్‌లు కోరారు.



ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో సుంకిడి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

రోడ్డు మీద జొన్న కుప్పలు.. రాకపోకలకు అంతరాయం



రోడ్డుపైనే వెలసిన జొన్న కుప్పలు



జొన్న కుప్పలపై నిరీక్షిస్తున్న రైతులు

తాంసి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. తాంసి, భీంపూర్ మండలాలకు సంబంధించిన రైతులు ఒకేసారి పెద్ద మొత్తంలో జొన్నలను తీసుకురావడంతో మార్కెట్లో స్థలం పెద్దగా లేదు. దీంతో రైతులు రోడ్డుకి ఇరువైపులనే జొన్న కుప్పలను పోస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ప్రయాణికులు అంటున్నారు. ఈ సంవత్సరం సుమారు ఈ మార్కెట్లో పదివేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి. కానీ మార్కెట్ యార్డులో సరియైన స్థలం లేక రైతులు రోడ్లపై కుప్పలు పోస్తున్నారని సీఈఓ కేశవ్ పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని ఆయన వివరించారు. ఈ విషయంలో తమకు రైతులు సహకరించాలని ఆయన కోరారు.



మురుగు ముందుకు వెళ్లేందుకు దారేది



వ్యాపార సముదాయాల ముందు నిలిచిన మురుగు నీరు

ఇచ్చోడలో అటకెక్కిన పారిశుధ్యం

ఇచ్చోడ, ఏప్రిల్, 26 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడలో పారిశుధ్యం అట కెక్కింది. ఏ కాలనీలో చూసినా.. రోడ్లపై చూసినా తాగునీటి లీకేజీలు, మురుగునీటి నిల్వలే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి అడే గామ (బి) గ్రామానికి వెళ్లే దారిపై నిత్యం మురుగు రోడ్డుపై పారుతోంది. అలాగే మండల కేంద్రం లోని దుకాణ సముదాయాల ముందు మురుగునీరే చేరి దుర్వాసన వెలువడుతున్న పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. మురుగు నీటిలోంచి వాహనాలు వెళుతున్నప్పుడు పక్కన నడిచే పాదచారుడిపై మురుగునీరు చల్లుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురగు నిలువ లేకుండా చర్యలు తీసు కోవాలని పలువురు కోరుతున్నారు. పోలీస్ స్టేషన్ ముందర ఉన్న రోడ్డుపై మురుగు నీటి గుంతలు ఏర్పడిన పంచాయతీ అధికారు లకు మాత్రం ఇచ్చోడ పం చాయతీ పరిధి అని తెలియడం లేదు. కేవలం అడేగామ (బి) గ్రామ పంచాయితీకి వెళ్లే రహదారిపై మురుగునీరు పారు తుంది. రహదారి పేరు అడే గామ (బి) సమస్య ఉంది ఇచ్చోడలోనే నని పంచాయితీ ఉన్నతాధికారులకు తెలియాల్సి ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు, మండల ఎంపీవో సైతం ఈ దారిగుండా మురుగునీటిలో నుంచే ప్రయాణాలు కొనసాగి స్తున్నారే.. తప్ప సమస్యను పరిష్కరిం చడంలేదని స్థానికులు వారి ఆవేదనను వ్యక్తం పరిచారు. అధికారుల నిర్లక్ష్యానికి సమాధానం ఏంటనీ స్థానికులు నిల దీస్తున్నారు.



అడేగామ(బి) గ్రామానికి వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా మురుగునీటి గుంతలు

మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మీ ఆత్మీయులలో.. మీ సహోద్యోగులలో... మీ కుటుంబ సభ్యులలో...
ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?



ఆంధ్రజ్యోతి 25%
ఆదిలాబాద్ 9985411291
నిర్మల్ : 8096677672
9985411453

CLASSIFIEDS

కావలెను
H ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీస్ నందు ఫుల్ టైం/ పార్ట్ టైం స్టాఫ్ మరియు ఏజెంట్లు కావలెను.సంప్రదించగలరు. సెల్ : 97040 52849
AJK-16738

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 175/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra
FOR SALE BEAUTICIAN COMPUTERS WANTED MOBILE REPAIRING ELECTRONICS EDUCATION AUTOMOBILES

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672

కరకట్టల ప్రతిపాదనలపై పట్టింపేది ?



- పరివాహక గ్రామాలను వరద నుంచి కాపాడేందుకు ప్లాన్
- 40 కిలో మీటర్ల పొడవుతో గోదావరికి ఇరువైపులా నిర్మాణానికి ప్రపోజల్స్
- రూ. 70 కోట్లతో అంచనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం పైనే ఆశలు

నిర్మల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్న గోదావరినది పరీవాహక గ్రామాలను ఆ వరద నుంచి రక్షించేందుకు ఇరిగేషన్ అధికారులు గత రెండేళ్ల క్రితం పకడ్బందీ ప్రతిపాదనలను రూపొందించి అప్పటి బీఆర్ఎస్ సర్కార్‌కు నివేదించారు. ఇదిలా ఉండగా ఏళ్ల నుంచి గోదావరి పరీవాహక గ్రామాలను వరద ముప్పు వెంటాడుతున్న క్రమంలో ఇరిగేషన్ అధికారులు కరకట్టల నిర్మాణ అంశానికి ప్రాధాన్యతనిచ్చారు. ప్రతి వర్షాకాలంలో వరద ముప్పు అధికారులకు అటు పరివాహక గ్రామాల ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతున్న అంశాన్ని ఆఫీసర్లు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రధానంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు గేట్ల దిగువ నుండి మొదలయ్యే గోదావరినది ఖానాపూర్ వరకు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఎగువ మహారాష్ట్ర నుండి వరద ఉధృతి పెరగడంతో ఈ ప్రాజెక్టు గేట్లు పైకెత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేస్తుంటారు. ఒకేసారి లక్షల క్యూసెక్కుల నీరు వరద రూపంలో ప్రవహిస్తున్న కారణంగా గోదావరి నది ఉప్పొంగుతుంటుంది. ఈ సమయంలో నదికి ఇరువైపులా ఉన్న పరివాహక గ్రామాలన్నీ వరద ముంపుకు గురవుతుండడం సహజంగా మారుతుంది. ప్రధానంగా మత్స్యకారులు, అలాగే పశువుల కాపరులతో పాటు నదికి అను కొని ఉన్న గ్రామాల ప్రజలంతా వర్షాకాలంలో ముప్పును ఎదుర్కొం టుండడం సహజంగా మారింది. దాదాపు 15 గ్రా మాలకు పైగా ప్రతీఏటా గోదావరినది వరద కారణంగా ముంపునకు గురవుతున్నాయి. దీంతో పాటు పరోక్షంగా మరికొన్ని గ్రామాలు కూడా ఇబ్బందుల పాలవుతున్నాయి. గోదావరి నది పరీ వాహక గ్రామాలను వరద నుంచి కాపాడేందుకు అధికారులు గోదావరిపై భద్రాచలం వద్ద కరకట్టల నిర్మాణం తరహాలో ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్ సర్కార్ దీనిపై ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించింది. భద్రాచలంలో గోదావరి నది వరద ఉధృతి నుంచి ఆ ప్రాంతాన్ని కాపాడేందుకు నిర్మించిన కరకట్టలు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్న అంశాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు జిల్లాలోని గోదావరినదికి ఇరువైపులా కూడా అలాంటి కర కట్టలను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి సర్కార్‌కు అందిం చారు.

40 కిలోమీటర్ల పొడవుతో..

సోన్ నుంచి జిల్లాలో ప్రారంభమయ్యే గోదావరినది ఖానాపూర్ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవుతో ప్రవహిస్తుంటుంది. ఈ నలభై కిలోమీటర్ల పొడవును పరిగణలోకి తీసుకున్న అధికారులు మొత్తం నదికి ఇరువైపులా కరకట్టలను నిర్మించాలని యోచిస్తున్నారు. దీనికోసం గాను దాదాపు రూ.70 కోట్ల వరకు వ్యయం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అయితే భద్రాచలంలో నిర్మించిన కరకట్టల తరహాలోనే కాకుండా మరింత శాస్త్రీయతను జోడించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటూ ఈ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్నారు.

15 గ్రామాలకు వరద ముప్పు..

ప్రతీఏటా గోదావరినది వరద ఉధృతి కారణంగా ఈ నది పరీవాహకంలోని దాదాపు 15 గ్రామాలు ప్రత్యక్షంగా ముంపుకు గురవుతుండగా మరికొన్ని గ్రామాలు పరోక్షంగా ప్రభావితమవుతున్నాయి. సోన్ నుంచి మొదలుకొని కూచన్‌పల్లి, ధర్మారం, పార్‌పెల్లి, మునిపల్లి, చింతల్ చందా, మామడ మండలంలోని కమల్‌కోట, పొన్కల్, ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి, బాధనకుర్తి ఖానాపూర్ గ్రామాలు గోదావరి నది ప్రవాహ ఉధృతికి ప్రతియేటా ముంపు బారిన పడుతున్నాయి. ఈ గ్రామాలతో పాటు గోదావరి నదికి ఉప నది అయిన స్వర్ణా నది పరివాహకంలోని పలు గ్రామాలు కూడా ముంపు బారిన పడుతున్నాయి. స్వర్ణ ప్రాజెక్టు నుంచి మాదాపూర్ వరకు గల గ్రామాలతో పాటు నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీ కూడా వరద ఉధృతికి ముంపుకు గురవుతోంది.



ఖానాపూర్ మండలం పలు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న గోదావరి నది ఇదే

కాంగ్రెస్ సర్కారుపై ఆశలు

అయితే గోదావరి పరివాహక ప్రాంతాలను వరద ముప్పు నుంచి కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఇటు అధికారులు, అటు స్థానికులు కోరుతున్నారు. ఈ కరకట్టల నిర్మాణ ప్రతిపాదనలను అప్పటి బీఆర్ఎస్ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని వీరంతా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే వరదల వల్ల జరుగుతున్న నష్టంపై సీరియస్‌గా స్పందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కరకట్టల నిర్మాణాలకు మోక్షం కల్పించ వచ్చని స్థానికులు ఆశిస్తున్నారు.

ఆరెంజ్ జోన్‌లో జిల్లా

- అన్ని మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు
- భైంసాలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖానాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అన్ని మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా ఆరెంజ్‌జోన్‌లో కొనసాగు తోంది. జిల్లాలోని భైంసా మండలంలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా మండలంలో అత్యల్పంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వరుసగా మూడు రోజులపాటు జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లాలో అధికారులు మూడు రోజులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. గత మూడు రోజులతో పోలిస్తే జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు కొద్దిపాటి తక్కువగా నమోదు కావడంతో జిల్లా వాసు లు తీవ్ర ఉక్కపోత నుండి కాస్త ఉపశమనం పొందారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆకాశం ఉదయం సాయంత్రం వేళల్లో మేఘావృతమై కనిపిం చింది.

అప్రజాస్వామికంగా నియమించిన కమిటీలను రద్దు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుభీర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అప్రజాస్వామికంగా నియమించిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీని రద్దు చేసి ప్రజాస్వామికంగా నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీ కోసం మండలంలోని 42 గ్రామపంచాయతీల్లో ఇంతకు ముందు గ్రామపంచాయతీ కార్యదర్శుల చేత గ్రామసభ ద్వారా ప్రజాస్వామికంగా కమిటీలు వేసి ఎంపీడీవో ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కమిటీ సభ్యులు పేర్లను పంపామని, అయితే ఇప్పుడు పేర్లన్నీ తారుమారు చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ సొంత కార్యకర్తల పేర్లను చేర్చి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ఇష్టారాజ్యంగా కమిటీలను ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. లబ్ధిదారులు విషయంలో ఎలాంటి గ్రామసభలు, తీర్మానాలు లేకుండానే ఈకమిటీ సభ్యులు ఇష్టరీతిన పేర్లను పంపవచ్చు అని దీంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. కావున వెంటనే ఈ కమిటీలను రద్దు చేసి గ్రామసభలు నిర్వహించి సభ తీర్మానం ద్వారా కొత్త కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో నవనీత్‌కుమార్‌కు వినతిపత్రం అందజజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గులాబ్ నాయక్, బోయిడి అభిషేక్, ఎన్నిల నాగేందర్, బొమ్మిడి మల్లేష్, తోకల మారుతి, జాదవ్ అజయ్, తదితరులున్నారు.



రోడ్డుపై బీజేపీ నాయకుల రాస్తారోకో

వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆదివారం నిర్వహించే వరంగల్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి కోరారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగబోయే రజతోత్సవ భారీ బహిరంగ సభకు అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

భారీగా జనసమీకరణ


కుభీర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్నిల అనీల్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పూర్తి చేయకుండా ప్రజలను రైతుబరోసా, రుణమాఫీ చేయకుండా మోసం చేయడంతో ప్రజలు రైతులు బీఆర్ఎస్ రజతోత్సవ సభ రావడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. కుభీర్ మండలం నుండి 10బస్సులు 70కిపైగా ప్రత్యేక వాహనాలను తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

తానూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒక గ్రామంలో మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో సంబంధిత వివరాలను వెల్లడించారు. నిందితుడు బాధితురాలు గ్రామశివారులో కాలకృత్యాల గురించి వెళ్లినప్పుడు మెండికే సునీల్(25) ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తానూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. విలేకరుల సమావేశంలో ముధోల్ సీఐ జి. మల్లేష్, ఎస్సై నవనీత్, స్టేషన్ సిబ్బంది ఉత్తమ్, వెంకటసాయి, కిరణ్, శ్రీనివాస్, గజేందర్, సందేశ్‌లు పాల్గొన్నారు.

కన్న కొడుకును చంపిన తండ్రి అరెస్టు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కన్న కొడుకు ను చంపిన కసాయి తండ్రిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నివసించే నిందితుడు, అతని భార్య గంగవ్వ ఇద్దరూ చాలా సంవత్సరాల నుండి మాట్లాడు కోవడం లేదు. వారికి ఒక కొడుకు ఒక కూతురు సంతానం ఉన్నారు. నిందితుడు తన తల్లితో ఒక గదిలో, అతని భార్య కొడుకు, కూతురుతో ఇంకో గదిలో నివాసం ఉంటున్నారు. మృతుడు అశోక్‌కు పెళ్లి కాకముందు మూడు సంవ త్సరాలు సౌదీ అరేబియా దేశం వెళ్లి వచ్చాక లక్ష్మణచాంద గ్రామానికి చెందిన లక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అతనికి ఒక కూతురు పుట్టాక మరలా ఒకసారి బెహరాన్ దేశానికి వెళ్లి అక్కడ పని చేసి డబ్బులు తండ్రికి పంపాడు. గత నాలుగు సంవత్సరాల క్రితం అశోక్ విదేశం నుండి తిరిగి వచ్చి అతను పం పిన డబ్బులు లెక్కలు చెప్పమని తండ్రి ఎర్రన్నను అడిగి అతనితో గొడవపడే వాడు. తన పిల్లలను ముట్టుకున్న తిట్టేవాడు. తన భార్యలక్ష్మీతో అక్రమ సంబం ధం ఉందని అనుమానించి తిట్టేవాడు, కొట్టేవాడు. అలాగే ఎప్పటికైనా చంపేస్తా అని బెదిరించేవాడు. ఈ నెల 24న రాత్రి సమయంలో అశోక్ తన తండ్రితో గొడవపడి అదే రోజు రాత్రి చంపేస్తా అని బెదిరించి వారి ఇంటి ముందు ఉన్న రేగుల షెడ్డులో పడుకున్నాడు. ఎర్రన్న తనను అశోక్ ఎప్పటికైనా చంపేస్తాడని అందుకు ముందుగానే తనే అతడిని చంపుదామని నిర్ణయించుకొని తన కొడుకు అశోక్ రేకుల షెడ్డు కింద నిద్రపోతుండగా ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై, నరకగా అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో అతని భార్య అరుపులు విని ఇంటి బయటకు రాగా ఆమెను కూడా ఇంట్లోకి వెళ్లిపో అనిచెప్పి అందరూ వస్తారని ఎవరికి తెలియకుండా ఊరు బయట ఉన్న చిన్నయ్య వరి పొలంలో గొడ్డలిని పారవేశాడు. తెల్లవారు జామున పొలాల మీదుగా లక్ష్మణచాంద బస్టాండ్‌కు చేరుకున్నాడు. నిందితుడిని శుక్రవారం బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ గోవర్ధన్‌రెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్ ఎండీ మాలిక్ రెహమాన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా

మహిళా సంఘాలు పొదుపుపై దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

కుంటాల, ఏప్రిల్, 26 : (ఆంధ్రజ్యోతి): పొదుపుతోనే అధికలాభం వస్తుందని మహిళా సంఘాలు పొదుపుపై దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాల స్థానిక మండల సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రుణాలు పొందిన సంఘ సభ్యులు నెలనెలా తప్పనిసరిగా రికవరీ చేపట్టాలన్నారు. రుణాల వసూళ్ల విషయంలో వెనుకడుగు వేయకుండా అన్ని రకాల రుణాలకు సంబంధించిన వసూళ్లను ప్రతినెలా తప్పనిసరిగా చేపట్టాలన్నారు. రుణాల వసూళ్ల క్రమం తప్పకుండా చేపడితే ఆ వసూళ్లతో మరికొంత మందికి రుణాలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సాయిప్రసాద్, ఎంపీడీవో లింబాద్రి, ఏపీఎం అశోక్, సీసీ పెంటన్న, యూసుఫ్, కవిత, అకౌంటెంట్ శివప్రసాద్, శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి నవీన్, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.



మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

నూతన కార్యవర్గం ఎన్నిక

మండల కేంద్రం కుంటాల మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బీ. కరుణ, కార్యదర్శిగా ఎం. సురేఖ, కోశాధికారిగా కవిత, సహా కార్యదర్శిగా కే. రాధిక, ఉపాధ్యక్షురాలిగా ఆర్. సురేఖలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను డీపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు.

భైంసాలో ముమ్మరంగా కొనసాగుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



తొలగింపులు తొలగిస్తున్న మున్సిపల్ టీపీవో అనురాధ



రోడ్డుపై ఉంచిన సామగ్రిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుల పర్వం ముమ్మరంగా కొనసాగుతోంది. మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన ఆక్రమణల తొలగింపులు శనివారం సైతం కొనసాగింది. జిల్లా అధనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ ఆదేశాల మేరకు రెండు శాఖల అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపడుతూ ఆక్రమణలను తొలగిస్తున్నారు. శనివారం పంజేషా చౌక్ నుంచి ఏఎస్పీ కార్యాలయం వరకు, మున్సిపల్ కార్యాలయం నుంచి మౌలానా చౌక్ వరకు వ్యాపారస్తులు చేపట్టిన ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపులు జరిగాయి. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి అనురాధ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అనీస్ అహ్మద్, టౌన్ సీఐ గోపీనాథ్, ఎస్ఐ గణేష్‌ల ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు పెట్టిన సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పలువురు వ్యాపారులు సామాగ్రిని తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ టీపీవో అనురాధ మాట్లాడుతూ వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తే సహించబోమని వెల్లడించారు. ఎంతటి వారైనా ఉపేక్షించకుండా తొలగింపులు చేపడుతామని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు, రాకపోకల ఆటంకాలు తొలగించే క్రమంలో ఆక్రమణల తొలగింపులు చేపడుతున్నామని వివరించారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో బాధిత కుటుంబాలకు బాసట

- ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు నిర్వహించుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి బాసటగా నిలుస్తున్నామని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలవాసులు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తొలగించి తోడ్పాటునిచ్చేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయకారిగా నిలుస్తోందన్నారు. నియోజక వర్గ పరిధిలోని బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం కోసం గాను భైంసాలోని తమ క్యాంపు కార్యాలయంలో చికిత్సకు సంబంధించి వివరాలు,బిల్స్ తీసుకవచ్చి సంప్రదించాలని సూచించారు. ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మురళిగౌడ్,మైసేకర్ సాయిలుతో పాటు పలువురు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తేనె తీస్తూ ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కడెం మండలంలో చోటు చేసుకుంది. కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కథనం ప్రకారం... జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెందిన కుర్ర మల్లేష్(28) తేనె కోసం చిట్యాల అటవీ ప్రాంతంలోకి శుక్రవారం రాత్రి వచ్చారు. ఈ క్రమంలో తేనె తీయడానికి చెట్టు పైకి ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై తెలిపారు.



కుర్ర మల్లేష్ మృతదేహం

విశ్రాంత ఎంఈవోకు పరామర్శ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం భాగ్యనగర్ కాలనీలో నివసిస్తున్న విశ్రాంత ఎంఈవో లక్కిడి గంగిరెడ్డిని శనివారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు పరామర్శించారు. ఇటీవల ఎంఈవో సతీమణి మృతి చెందిన విషయం తెలుసుకున్న శ్రీహరిరావు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. కాలనీ వాసులు డీఎస్ రాజేశ్వర్, కృష్ణ మోహన్‌గౌడ్, రమణారెడ్డి, అడపా శ్రీకాంత్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సార్వత్రిక పరీక్షలపై డీఈవో సెట్ కాన్ఫరెన్స్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహిస్తున్న సార్వత్రిక పరీక్షలపై డీఈవో రామారావు శనివారం సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రశ్నపత్రాలను పోలీసుస్టేషన్లలో భద్రపర్చాలని సూచించారు. సమాధాన పత్రాలను తపాలా కార్యాలయాల్లో పోస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని నిర్మల్, భైంసా ఎస్సైలను కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని బర్కత్‌పురాలో 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నామని తెలిపారు. దీనితో రోడ్‌నెంబర్ 2, 3 ప్రాంతవాసులు సహకరించాలని కోరారు.

భూ భారతి చట్టం రైతులకు వరం



భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్

దిలావర్‌పూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం రైతులకు ఒక వరమని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం గుండంపల్లిలో జరిగిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు చక్కని చట్టబద్ధమైన పరిష్కారం భూ భారతి ఇస్తుందన్నారు. త్వరలోనే గ్రామాల్లోకి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కే. దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.